# పరిశోధన

స్త్రీ హృదయం లోతులు తీసేందుకూ, ఆ మూలాగ్ర పరిశోధన చేసేందుకూ, పురుషుడు ఒక లేబోరేటరీ ఓపెన్ చేశాడు. లేబరేటరీ నిండా ప్రణయకావ్యాలూ, జగన్మోహనుల వర్ణ చిత్రాలు నింపి, పరిశోధన ప్రారంభించాడు. ఒక శోధన నాళిక కూడా తెచ్చాడు. స్త్రీ పురుషుణ్ణి, అందం కోసమా, అనురాగం కోసమా, శరీరం గురించా, దేని కోసం ప్రేమిస్తోంది? ఈ విషయం తెలీక పురుషుడు 'స్త్రీ' హృదయాన్ని శోధన నాళికలో వేసి, ప్రశ్నించాడు కాస్త వేడిచేసి. 'స్త్రీ' హృదయం టింగ్, టింగ్ అని ఎగతాళిగా స్పందించిందే కాని ఏమీ జవాబివ్వలేదు. పురుషుడు విసుక్కుని ఇంకా కాస్త వేడి చేసి అడిగాడు 'స్త్రీ' హృదయాన్ని. సమాధానం లేదు. పురుషుడు, శోధన నాళికని ఎగాదిగా చూచి, ఏదో కనుక్కున్న వాడల్లే, ''స్త్రీ పురుషుడి సౌందర్యం చూసి ప్రేమిస్తోంద''న్నాడు.

కాని శోధన నాళికలోని స్త్రీ హృదయం ఫక్కున నవ్వింది. విషాదం సూచిస్తూ పురుషుడు ఉలిక్కిపడి శోధన నాళికలోకి చూశాడు. శోధన నాళిక రంగు మారుతోంది. పురుషుడు, ఇలా అనుకున్నాడు ''స్త్రీ పురుషుణ్ణి, గతి లేకా, రక్షణ లేకా, ప్రేమిస్తోంది, స్త్రీ అబల'' అని జాలిగా.

కాని ఈ సిద్ధాంతం మీద పురుషుడు ఎక్కువసేపు నిలవలేదు.

ఒకరోజు పురుషుణ్ణి 'స్త్రీ' చెంపచెళ్ళుమనేట్టు బాదింది. ఖడ్గంతో యుద్ధానికి దిగింది. పురుషుడి మీద రాజ్యం చేసింది. ఇహ ఎట్లాగతి? అని పురుషుడు దిగులు పడ్డాడు.

పురుషుడు ''స్త్రీ'' హృదయాన్ని మళ్ళీ శోధన నాళికలో వేసి, వేడి చేశాడు. భయంకరమైన రంగులోకి మారింది, స్త్రీ హృదయం. పురుషుడు భయపడి శోధన నాళిక దూరంగా పెట్టి కళ్ళుమూసుకుని ఆలోచించాడు.

''స్త్రీ.... శక్తి, అది యేమన్నా చేయగలదు'' అన్నాడు పురుషుడు.

పరిశోధన, ఇంతటితో ఆపలేదు పురుషుడు. ఇంకా చేస్తున్నాడు ... స్త్రీ కోసం రాజ్యాలూ, మేడలు, ఉద్యోగాలూ, స్కూలు పరీక్షలు, అన్నీ వొదులుకుంటున్నాడు పురుషుడు. మరి పరిశోధన తేలడం ఎట్లా? ఇంకా రాత్రనక, పగలనక, వాననక, యెండనక స్త్రీ వెంట తిరుగుతున్నాడు పెంపుడు కుక్కలాగ.

శోధన నాళికలోని 'స్త్రీ' హృదయాన్ని పురుషుడు గాఢంగా ముద్దుపెట్టుకుని 'స్త్రీ' హృదయం,

ఒక అయస్కాంతపురాయి. దానికి పురుషుణ్ణి ఆకర్షించడం తప్ప వేరే, ఉద్యోగం లేదు.'' అని తీర్మానించాడు, తన బరువైన హృదయానికి కాస్త విరామం కల్పించటానికి.

కాని అప్పటికీ విరామం చిక్కలేదు పురుషుడికి. '' ఎబ్బే, స్త్రీ పురుషుడికి ఆస్తి. చరాస్తి అంతే!'' అనుకున్నాడు గట్టిగా శ్వాస పీల్చి.

పోని ఈ అభిప్రాయం ఎక్కువ సేపు నిల్చిందా? స్త్రీ కన్నీళ్ళు పెడితే చూసి, ''పాపం స్త్రీ, భోగ్యవస్తువు, కాని, ఆమె పరాయత్త'' అని విలపించాడు. పురుషుడు తన విలాపం మానుకుని, కళ్ళుతుడుచుకుని టెస్టుట్యూబ్‌లోకి చూశాడు. 'స్త్రీ' హృదయం అందులో లేదు! పురుషుడికి పూర్వాభిప్రాయం సడలి, వొళ్ళు మండింది: ఇలా పెద్దగా అరిచాడు, ''అరెరే! స్త్రీ లేచిపోయిందే? దీన్ని నమ్మరాదు. స్త్రీ వంచకురాలు'' అని కోపంగా అన్నాడు.

చివరికి పురుషుడు విసిగెత్తి, ''స్త్రీకి హృదయమే లేదసలు. ఇన్నాళ్ళ బట్టి పరిశోధించింది, దేన్నో అంతు తేలటంలేదు'' అన్నాడు. పైగా, అసలు ''స్త్రీ లేకపోతేనే పురుషుడికి ఏ మంచి జరిగినా 'స్త్రీ'తో పురుషుడి సంబంధం నీచం'' అని తేల్చివేశాడు.

''ముక్కు మూసుకుని, అడవులకి పోయి, బ్రహ్మచర్యం అవలంబించి ఇంద్రియనిగ్రహం, చేయడం మంచిది'' అని నిబ్బరంగా ఆలోచిస్తూ పురుషుడు, తన చేతిలో శోధన నాళిక చిదగ్గొట్టి, లేబొరేటరి తగలెట్టాడు.

''పిచ్చి పురుషుడా, నువ్వేం కనుక్కున్నావ్ నన్ను గురించి ఇంత కాలం ఊహాగానం చేశావు అంతే'' అంది. 'స్త్రీ' తగలడిపోతున్న లేబరేటరీ మంటల్లోంచి పక పక నవ్వుతో పురుషుడు విస్తుపోయి, ''నిజం''? అని అడిగాడు స్త్రీ స్వరాన్ని.

'స్త్రీ' స్వరం ''నిజమే'' అంది.

అయితే, పురుషుడు, ''స్త్రీ''కి ఓడిపోతల్చుకోలేదు గావును, గంభీరంగా స్టేజీ ఎక్కి, మీసం మెలేసి, ''పాపం, 'స్త్రీ'' అణగారిపోతోంది. అస్వాతంత్ర్యంలో; ఆమెకి స్వతంత్రం కావాలిప్పుడు అని పెద్దగా, 'మైక్' లు దద్దరిల్లేట్టు అరిచాడు.

'స్త్రీ' స్వరం వికటాట్టహాసం చేసింది ప్రతిధ్వనిగా! పైగా ఛాలెంజి చేసింది. ''నువ్వు నన్ను గురించి యేమీ శ్రమ పడక్కర లేదు'' అని.

*(జ్యోతి సచిత్ర పక్ష పత్రిక 15 మార్చి 1948)*